క్లుప్తంగా

'విజయోత్సవ ర్యాలీకి అనుమతి లేదు'

జన్నారం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే జన్నారం మండలం కేంద్రంలో విజయోత్సవ ర్యాలీలు, టపాసులు పేల్చడాలు, డీజేలతో బైక్ ర్యాలీ చేయడం, ప్రజలు ఒక చోట గుమిగూడటం లాంటివి నిషేధించినట్లు ఎస్సై సతీశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఖానాపూర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సందర్భంగా ఆదివారం ర్యాలీలు, వేడుకలకు అనుమతి లేదని ఖానాపూర్ సీఐ మోహన్ అన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్, 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున బాణసంచా పేల్చడం, డీజేలు పెట్టడం, గుంపులుగా తిరగడం, ర్యాలీలు పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముధోల్/కడెం/కుంటాల/లక్ష్మణచాంద/సోన్/పెంబి: ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదని ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి, సోన్ సీఐ నవీన్ కుమార్, ఎస్సైలు కొసన రాజు, హన్మాండ్లు, రజనీకాంత్ వేర్వేరుగా ఓ ప్రకటనలో తెలిపారు.

పరామర్శ



మల్లేశ్‌ను పరామర్శిస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 15వ వార్డు కౌన్సిలర్ శ్రీరాముల సుజాత, మల్లేశ్ కుటుంబ సభ్యులపై శుక్రవారం దాడి జరగ్గా, శనివారం మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి వివరాలను అడిగి తెలుసుకుని, భయపడకుండా ఉండాలని, బీఆర్ఎస్ నాయకులకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

హెచ్ఎమ్మెస్ డివిజన్ కార్యదర్శిగా నవీన్‌కుమార్



మందమర్రిరూరల్: మందమర్రి డివిజన్ హెచ్ఎమ్మెస్ కార్యదర్శిగా శాంతిఖనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వర్తించే నవీన్‌కుమార్‌ను నియమిస్తూ హెచ్ఎమ్మెస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. తనకు పదవి ఇచ్చినందుకు రియాజ్ అహ్మద్‌తో పాటు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఏర్పాటు



భీమారం: పంచాయతీ రాజ్ ఉపాధ్యాయ సంఘం (తెలంగాణ) మండల కమిటీ అధ్యక్షుడిగా నర్సింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గుడిమల్ల నరేందర్‌తో పాటు కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో జరిగిన కార్యవర్గ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రధానకార్యదర్శిగా ఆసంతుల రవీందర్ ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకముందే పట్టించుకోండి



భీమిని: పత్తిలోడ్ ట్రాక్టర్లు రాత్రి వేళల్లో వెళ్తుండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. భీమిని, కన్నెపల్లి మండలాల్లో సేకరించిన పత్తిని ఇంటికి తరలించేందుకు ట్రాక్టర్ ట్రాలీని డోర్లు తీసి వెడల్పుగా అమర్చి అందులో పత్తి బస్తాలు వేసి దాని పై కూలీలు కూర్చొని ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. రాత్రి వేళల్లో లోడ్‌తో వచ్చే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలు గమనించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతేడాది పోలంపల్లి శివారులో పత్తి లోడ్ ట్రాక్టర్‌కు ఆటో ఢీ కొనడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. అలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు దష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

సమస్యల్లో 'కొత్తగూడ'

- పేరుకుపోయిన సమస్యలు
- చుట్టూ గుట్టల మధ్యలో గిరి పల్లె
- కనీస సౌకర్యాలు కరువు
- కొత్త ప్రభుత్వంపై గంపెడాశలు



కొత్తగూడ గ్రామం



కొత్తగూడకు వెళ్లే మట్టి రోడ్డు

కెరమెరి: మండలంలోని కొత్తగూడ గ్రామంలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇప్పటివరకు ఎన్నో ప్రభుత్వాలు మారినా వారి గ్రామస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో నేడు వెలువడే ఫలితాల తర్వాత ఏర్పడే ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్నారు. ఏళ్లకు పైగా సమస్యలు పేరుకుపోయినా పరిష్కరించేవారు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కెరమెరి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కొత్తగూడ గ్రామంలో 120 మంది జనాభా ఉన్నారు. మండల కేంద్రానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామం సమస్యల్లో కొట్టుమిట్టాడుతుంది. తాగునీరు, రోడ్డు, పక్కా గృహాలు, బడి, అంగన్‌వాడీ కేంద్రం లేక స్థానికులు తిప్పలు పడుతున్నారు.

పశువుల కొట్టం.. పాఠశాల భవనం

లక్షల రూపాయలు వెచ్చించి పాఠశాల భవనాన్ని నిర్మించినా ప్రస్తుతం భవనాన్ని పశువుల కొట్టంగా వాడుకుంటున్నారు. గ్రామంలో ఉన్న 17 మంది విద్యార్థులు ఇతర ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం కూడా లేకపోవడంతో సుమారు 25 మంది చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్డు..

గ్రామానికి వెళ్లడానికి ఉన్న మట్టిరోడ్డు అధ్వానంగా ఉంది. గతేడాది బీటీ రోడ్డు మంజూరైనప్పటికీ ఇంకా టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. రోడ్డుపై మట్టి, దుమ్ము కారణంగా నడవడానికి యోగ్యంగా లేకుండా పోయింది. వానాకాలంలో రోడ్డు కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. అధికారులు స్పందించి త్వరలో పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. మిషన్ భగీరథ ఉన్నా నల్లాలు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు.

సమస్యలు పరిష్కరించాలి



మిషన్ భగీరథ నీరు ప్రతీరోజు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. నల్లాలు బిగించాలి. పాఠశాలను ప్రారంభించి ఇక్కడే బోధన చేయాలి. అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలి. త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తే నడిచేందుకు యోగ్యంగా ఉంటుంది.

\- దుర్వ చతుర్‌శావ్

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: కాగజ్‌నగర్‌కు చెందిన దుర్గా సునీల్ అనే యువకుడు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చంద్రశేఖర్ బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ దుర్గా సునీల్ సెల్‌ఫోన్ పోగొట్టుకొని ఫిర్యాదు చేయగా కోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేశామన్నారు.

మెనూ పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న చంద్రశేఖర్

కెరమెరి: మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మెనూ పాటించాలని కెరమెరి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని సుల్తాన్‌గూడ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని పేర్కొన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజా మహోత్సవం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల హిందూ సేవక్ సమాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీ దుకాణ సముదాయం ఆవరణలో నిర్వహించిన సామూహిక అయ్యప్ప పడిపూజా మహోత్సవం అత్యంత వైభవోపేతంగా, కనుల పండువగా జరిగింది. గురుస్వామి శ్రీమాన్ చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక అయ్యప్ప పడిపూజా మహోత్సవం దేదీప్యమానంగా సాగింది.అనంతరం అయ్యప్ప స్వామి విగ్రహాన్ని పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ఇక 18 మెట్ల పూజలో భాగంగా కళశాలతో వేద మంత్రాలతో పాటు తాంత్రిక పూజలు జరిపి పడి ముట్టించారు. మన్నవ విజయభాస్కర్ గురుస్వామి 18వ పడి కావడంతో స్వామికి మంత్రోపదేశం చేసి మంత్ర దండం, కొబ్బరి చెట్టును అందజేసి శబరిమల అయ్యప్పస్వామి దర్శనం కనుల పండవగా జరగాలని పేటతుళ్లి ఆడుతూ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా సత్కరించారు. హిందూ సేవక్ సమాజ్ వ్యవస్థాపకుడు బండవరం జగన్, సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో అయ్యప్ప భజన బృందం పాటలతో పడి పూజ పరిసరాలన్నీ అయ్యప్ప శరణుఘోషతో మారుమోగింది. నడిపెల్లి దివాకర్‌రావు, వెరబెల్లి రఘునాథ్, కొక్కిరాల సురేఖ తదితర పుర ప్రముఖులు హాజరయ్యారు.

సిర్పూర్ బాద్‌షా ఎవరో..?

- నేడు ఎన్నికల ఫలితాలు
- అభ్యర్థుల్లో ఉత్కంఠ
- 1952 నుంచి ఇక్కడ ఎన్నికలు
- గెలిచిన వారికి మంత్రి పదవులు



ప్రవీణ్‌కుమార్



కోనేరు కోనప్ప



హరీశ్‌బాబు



రావి శ్రీనివాస్

కౌటాల: రాష్ట్రంలోని నంబర్ వన్ నియోజకవర్గం సిర్పూర్‌లో 2023 ఎన్నికల ప్రచారం రసవత్తరంగా జరిగింది. నేడు ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రధాన అభ్యర్థుల్లో బీఆర్ఎస్ నుంచి కోనేరు కోనప్ప, కాంగ్రెస్ నుంచి రావి శ్రీనివాస్, బీజేపీ నుంచి పాల్వాయి హరీశ్‌బాబుతో పాటు బీఎస్పీ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోటీలో ఉన్నారు. దీంతో రాష్ట్ర ప్రజల దృష్టంతా సిర్పూర్ నియోజకవర్గంపై పడింది. రాష్ట్రంలోని ప్రజలు సిర్పూర్ రిజల్ట్‌పై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సిర్పూర్ 17వ ఎమ్మెల్యేగా ఎవరు గెలుస్తారని చర్చించుకుంటున్నారు. ఆయా ప్రధాన పార్టీ అభ్యర్థులు తమ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

1952 నుంచి ఎన్నికలు

తెలంగాణలో తొలి నియోజకవర్గం సిర్పూర్ 1952 నుంచి ఉంది. తొలి రోజుల్లో ఈ ప్రాంతంలో సోషలిస్టు ప్రభావం అధికంగా ఉండేది. 1952, 57లలో సోషలిస్టు అభ్యర్థులు గెలుపొందారు. 1957లో ఈ నియోజకవర్గం ద్విసభ్య నియోజకవర్గంగా ఉంది. అంటే ఒకే నియోజకవర్గం నుంచి ఒక జనరల్ అభ్యర్థిని, ఒక రిజర్వుడ్ కేటగిరి అభ్యర్థిని ఎన్నుకోవాలి. విశేషం ఏమిటంటే ఈ నియోజకవర్గంలో ఇద్దరు అభ్యర్థులు ఎస్.సి అభ్యర్థులే గెలుపొందారు. కోదాటి రాజమల్లు ప్రజాసోషలిస్టు పార్టీ అభ్యర్థిగా గెలుపొందితే, గడ్డం వెంకటస్వామి కాంగ్రెస్ పక్షాన గెలిచారు. ప్రముఖ కార్మిక నేత జి. సంజీవరెడ్డి రెండు సార్లు, స్వాతంత్ర్యయోధుడు కె.వి. కేశవులు రెండుసార్లు, టీడీపీ ఆవిర్భావం తరువాత కె.వి. నారాయణరావు రెండుసార్లు, పాల్వాయి పురుషోత్తంరావు రెండుసార్లు ఇండిపెండెంట్‌గా గెలుపొందగా, పురుషోత్తంరావు భార్య పి.రాజ్యలక్ష్మి ఒకసారి టీడీపీ తరఫున గెలిచారు.

మంత్రులుగా..

తొలిసారి 1983లో టీడీపీ ఇక్కడ నుంచి గెలిచింది. అప్పటి నుంచి 2004లో కోనప్ప కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచేవరకు ఇక్కడ కాంగ్రెస్ ఐకి అవకాశం రాలేదు. మళ్లీ 2009లో టీఆర్ఎస్ గెలవడం విశేషం. అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ ఐ కలిసి ఆరుసార్లు, సోషలిస్టు ఒకసారి, ప్రజాసోషలిస్టు పార్టీ ఒకసారి, టీఆర్ఎస్ మూడు సార్లు గెలువగా, టీడీపీ మూడుసార్లు గెలిచింది. ఇండిపెండెంట్‌లు రెండుసార్లు గెలిచారు. ఒకసారి అసెంబ్లీకి ఎన్నికైన వెంకటస్వామి ఏడుసార్లు లోక్‌సభకు ఎన్నికై రికార్డు సష్టించారు. రాజమల్లు, కె.వి. కేశవులు గతంలో జలగం వెంగళరావు క్యాబినెట్‌లో మంత్రి పదవులు నిర్వహించారు. కాసు బ్రహ్మానందరెడ్డి క్యాబినెట్‌లో జి. సంజీవరెడ్డి మంత్రిగా ఉన్నారు. వెంకటస్వామి రాష్ట్రంలో, కేంద్రంలో మంత్రిగా పనిచేశారు. వెంకటస్వామి ఎమ్మెల్సీగా కూడా కొంతకాలం ఉన్నారు. ఇండిపెండెంట్‌గా రెండుసార్లు గెలిచిన పాల్వాయి పురుషోత్తంరావు 1999 నాటికి టీడీపీలో చేరారు. ఎన్నికలు జరగడానికి ముందే పురుషోత్తంరావును నక్సలైట్లు హత్య చేయడంతో ఆయన భార్యకు టీడీపీ టికెట్ ఇచ్చింది. ఒకసారి గెలిచిన ఆమె ఆ తరువాత 2004లో పోటీచేసి ఓడిపోయారు.

ఒకే ఒక మహిళా..

సిర్పూర్ కాగజ్‌నగర్‌లో తెలంగాణ రాష్ట్ర సమితి అభ్యర్థి కోనేరు కోనప్ప 2018లో మరోసారి విజయం సాధించారు. ఆయన 2014 ఎన్నికల్లో బీఎస్పీ తరఫున పోటీచేసి గెలుపొంది, తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. కాగా 2004లో కాంగ్రెస్ ఐ పక్షాన కోనప్ప గెలిచారు. 2009లో గెలుపొందిన కావేటి సమ్మయ్య తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఒకసారి రాజీనామా చేశారు. తదుపరి జరిగిన ఉప ఎన్నికల్లో తిరిగి గెలుపొందారు. కోనేరు కోనప్ప కమ్మ సామాజిక వర్గానికి చెందినవారు. కోనప్ప మూడుసార్లు గెలువగా, గతంలో ఇదే సామాజిక వర్గానికి చెందిన కె.వి. నారాయణరావు రెండుసార్లు గెలిచారు. దీంతో ఐదుసార్లు కమ్మ నేతలు గెలిచారు. వెలమ నేతలు మూడుసార్లు, బీసీ నేతలు నాలుగుసార్లు, రెడ్డి నేతలు రెండు సార్లు, దళిత నేతలు మూడుసార్లు విజయం సాధించారు. ఇప్పటి వరకు ఒకే ఒక మహిళ పాల్వాయి రాజలక్ష్మి ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

అందని పశువైద్యం!

- మృత్యువాత పడుతున్న పశువులు
- నూతన పశువైద్య కేంద్రం కోసం డిమాండ్



డబ్బాలోని పశువైద్య కేంద్రం

చింతలమానెపల్లి: మండలంలో పశువైద్యం అందని ద్రాక్షగా మారింది. మూగజీవాలకు అత్యవసర వైద్యం అందక పోవడంతో మృత్యువాత పడుతున్నాయి. పశువులకు వైద్యం చేయించడానికి ప్రభుత్వ వైద్యం అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటుగా వేలాది రూపాయలు చెల్లించి వైద్యం చేయించడం.. లేక నాటు వైద్యం దిక్కవుతోంది. మరోవైపు అధికారుల పర్యవేక్షణ లేక పశువైద్యశాలల పరిస్థితి అధ్వానంగా మారుతోంది.

ఇదీ పరిస్థితి..

మండలంలోని డబ్బాలో ప్రభుత్వ పశువైద్యశాల, రవీంద్రనగర్‌లో బాబాపూర్ పశు ఆరోగ్య ఉపకేంద్రం ఉన్నాయి. డబ్బాలోని పశువైద్య కేంద్రంలో పశువైద్యాధికారి, వీఎల్‌వో, ఓఎస్ పోస్టులు కేటాయించారు. డబ్బా పశువైద్య కేంద్రంలో ఇన్‌చార్జిగా కౌటాల పశువైద్యాధికారి శ్రీకాంత్ విధులు నిర్వహిస్తున్నారు. వీఎల్‌వోగా ఇక్కడ నియమించిన ఉమ డెప్యూటేషన్‌పై కరీంనగర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఓఎస్ షాహెదా విధుల్లో ఉన్నారు. బాబాపూర్ పశువైద్య ఉప కేంద్రంలోని వెటర్నరీ అసిస్టెంట్ సునీల్ రవీంద్రనగర్ పశు వైద్య ఉపకేంద్రం, డబ్బా పశువైద్యశాలలో వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. ఎల్ఎస్ఏ పోస్టు ఖాళీగా ఉంది.

పశువుల సంఖ్య ఎక్కువే..

మండలంలోని బాబాపూర్, దిందా, డబ్బా, అడెపెల్లి, కోయపెల్లి, బూరుగూడ గ్రామాలలో ఎక్కువగా గొర్రెలు పెంచుతుంటారు. మండలంలో వ్యవసాయంపై ఆధారపడి జీవించే వారు ఎక్కువగా ఉండగా పశువుల సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. పాల పెంపకం కోసం గేదెలు పెంచుతున్నారు. ఇక్కడి గ్రామాలలో ఆహార అవసరాలకు కోళ్లను పెంచడం సాధారణం.

అందుబాటులో ఉండని అధికారులు

డబ్బా పశువైద్య కేంద్రంలో ఇన్‌చార్జి పశువైద్యాధికారి విధులు నిర్వహిస్తుండడంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు అందుబాటులో లేక ఆయా గ్రామాలలో పశువైద్యం సకాలంలో అందడం లేదు. గొర్రెల పెంపకందారులు సొంత వైద్యం లేదా నాటు వైద్యంపై ఆధారపడుతున్నారు. వైద్యం అందక పశువుల మృత్యువాత పడుతున్న ఘటనలు తరచూ నమోదవుతున్నాయి. పాము కాటుకు గురైనా, ఇతర అత్యవసర పరిస్థితుల్లోనూ పశువులకు వైద్యం అందడం లేదని పశువుల యజమానులు వాపోతున్నారు. మరోవైపు మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న డబ్బా పశువైద్యశాలకు పశువులను తరలించడం కోసం నానా ప్రయాసలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యం కోసం పశువైద్యశాలకు వెళ్తే అధికారుల నుంచి కనీస స్పందన కూడా ఉండడం లేదని, సిబ్బంది లేరనే సమాధానం ఇస్తున్నారని పశువుల యజమానులు ఆరోపిస్తున్నారు. కాగా మండల కేంద్రానికి నూతనంగా పశువైద్యశాలను కేటాయించాలని, సరిపడా సిబ్బందిని సైతం నియమించాలని మండల వాసులు కోరుతున్నారు.

అందుబాటులో ఉంటున్నాం..

మండలంలోని పశువుల యజమానులకు అందుబాటులో ఉంటున్నాం. వీలైనంత వరకు శిబిరాలు నిర్వహించి టీకాలు వేయడంతో పాటు వైద్యసేవలు అందిస్తున్నాం. పశువులకు వైద్యం కోసం పశువుల యజమానులు సమాచారం ఇస్తే వారికి పూర్తిస్థాయిలో సహకరిస్తాం.

\- సునీల్, వెటర్నరీ అసిస్టెంట్

5 నుంచి బోర్లకుంట జాతర



జాతరకు సిద్ధం చేసిన దవల్‌మాలిక్ బాబా దర్గా

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని గ్రామాల మధ్య ఉన్న దవల్‌మాలిక్ బాబా (బోర్లకుంట) జాతర 5వ తేదీ నుంచి జరగనుంది. దీంతో జాతర కమిటీ సభ్యులు జాతర ఏర్పాట్లు శనివారం పూర్తి చేశారు. మూడు రోజుల పాటు జరిగే జాతర ఉత్సావాలకు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలతో పాటు, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు ఖాశీం, నిపాని సర్పంచ్ రాజన్న, పిప్పల్‌కోటి సర్పంచ్ గంగయ్య తెలిపారు.

నేడు రావుల మల్లన్న బోనాలు



రావుల మల్లన్న ఆలయం వద్ద జాతర (ఫైల్)

దహెగాం: మండల కేంద్రంలోని మల్లన్న ఒర్రె సమీపంలో రావుల మల్లన్న ఆలయం వద్ద ఆదివారం బోనాల పండుగ నిర్వహించనున్నారు. కార్తీక పౌర్ణమి తరువాత వచ్చే తొలి ఆదివారం బోనాల పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. బోనాల సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. జాతర నిర్వహించనున్నారు. మండల కేంద్రంతో పాటు పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, కన్నెపల్లి తదితర మండలాల నుంచి భారీగా భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

'ధాన్యం తూకంలో కోతలు సరికాదు'

ఖానాపూర్: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అధికారులు ఇష్టారాజ్యంగా కోతలు విధించడం సరికాదని ప్రజాసంఘాల పోరాట కన్వీనర్ నూతన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం రైతులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వారు మాట్లాడుతూ 40 కిలోల బస్తా బరువు పేరిట కిలో కోత విధించడంతోపాటు అదనంగా మరో కిలో కోత విధించడం సరికాదన్నారు. అధికారులు తీరు మార్చుకోకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న సఖీ సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: బాలికలకు, మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి అన్నారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమంలో భాగంగా శనివారం మావల మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించారు. ఈనెల 10న నిర్వహించనున్న మానవ హక్కుల దినోత్సవం వరకు స్త్రీలకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా.. మహిళలపై, చిన్నారులపై హింసలు ఆగడం లేదన్నారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం సిబ్బంది లావణ్య, పాఠశాల ప్రిన్సిపాల్ రేవరల్ టామి, జీన్స్ థామస్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాంసి: దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భీంపూర్ ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగపెల్లి జ్ఞానేశ్వర్ సూచించారు. శనివారం భీంపూర్ మండలంలోని జల్‌కోరి, అందర్‌బంద్ గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గంగాధర్, ఏఎన్ఎం సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



గోదావరిని సన్మానిస్తున్న నాయకులు

నార్నూర్: మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, సరస్వతి దంపతుల కుమార్తె బానోత్ గోదావరి తొలి ప్రయత్నంలోనే కేంద్ర విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. శనివారం వారి స్వగృహంలో గిరిజనేతరుల సంఘం మండలాధ్యక్షుడు షెక్ దాదేఅలీ ఆమెను సన్మానించారు. గోదావరిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన వెంట అన్నాభావుసాతే కమిటీ మండలాధ్యక్షుడు కొర్రెళ్ల మహేందర్, తదితరులు ఉన్నారు.